విద్యా ప్రదాయిని నమో నమః



చినవాల్తేరులో సరస్వతీ దేవిగా లలితాదేవి



ప్రేమసదన్‌లో దుర్గాదేవి అమ్మవారు



సరస్వతీ అలంకరణలో విజయదుర్గాదేవి



చినవాల్తేరులో అన్న పూర్ణదేవి రూపంలో..



పీతలవానిపాలెంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఏయూ క్యాంపస్: విద్యలనొసగే విద్యా ప్రదాయిని సరస్వతీదేవి అవతారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పెదవాల్తేరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి, అవుట్‌గేట్ లలితా సుందరేశ్వర పీఠంలో లలితా త్రిపుర సుందరిదేవిని శుక్రవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో సరస్వతీ పూజ చిన్నారులతో చేయించారు. విద్యాబుద్ధులు ప్రసాదించాలని ప్రార్థిస్తూ అమ్మవారిని పూజించారు. పోలమాంబ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చింది. వెంకట అన్నమాచార్య ట్రస్ట్ సభ్యులు భజన కార్యక్రమం, సాయంత్రం కె.మురళీకృష్ణ ప్రవచనం, జి.శారద గాత్ర సంగీత కచేరి అలరించాయి. లలితా సుందరేశ్వరి పీఠంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. చినవాల్తేరు అమ్మవారి వీధిలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

వర్సిటీలో దుర్గా పూజ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం దుర్గా పూజ నిర్వహించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి స్వయంగా పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, కంప్యూటర్ సెంటర్ సంచాలకుడు ఆచార్య భాస్కరరెడ్డి, దూర విద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, డాక్టర్ హెచ్. పురుషోత్తం, కంప్యూటర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా 1008 పెన్నులు, పుస్తకాలతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం వేద పఠనం, అష్టోత్తర కార్యక్రమాలు జరిగాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీచండికాదేవి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజలు, భజనలతో భక్తులు అమ్మవారిని సేవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, గౌరవ అధ్యక్షుడు పీవీ శ్రీహరిరాజు, కోశాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దుర్గా పూజలో పాల్గొన్న వీసీ ప్రసాద రెడ్డి



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

విజయదుర్గా కాలనీలో..

ఆరిలోవ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాక దరి విజయ దుర్గా కాలనీలోని విజయదుర్గా ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. తెల్ల హంస వాహనంపై వీణ పట్టుకుని సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అర్చకులు చిన్నారులతో అమ్మవారికి పూజలు చేశారు.

పీతలవానిపాలెంలో కుంకుమ పూజ

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ సన్నిధిలో 100 మంది చిన్నారులతో సరస్వతీదేవి పూజ చేశారు. అనంతరం సాయంత్రం 250 మంది మహిళలతో కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పెసలు శ్రీను, హరి, మల్లా రవి రమేష్, ఏపీ పోలీసు హౌసింగ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, పీతల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రిలో ఉద్యోగాలకు 395 దరఖాస్తులు

ఏయూ క్యాంపస్: మానసిక ఆస్పత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే ఉద్యోగాలకు 395 దరఖాస్తులు వచ్చినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు అత్యధికంగా 342, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి 19, గ్రూప్ డీ అటెండర్ ఉద్యోగానికి 34 దరఖాస్తులు వచ్చాయన్నారు. చైర్‌పర్సన్ ఉద్యోగానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన పేర్కొన్నారు.

మెరిసిన మనీష్, శశికాంత్

ఎస్‌ఎంఏ టోర్నీలో ఆంధ్రా జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: సయిద్ ముస్తక్ అలీ(ఎస్‌ఎంఏ) ట్రోఫీలో విశాఖ కుర్రాళ్లు మెరిశారు. రాంచీ వేదికగా శుక్రవారం జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 145 పరుగుల తేడాతో అరుణాచల్‌ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఆంధ్రా తొలుత బ్యాటింగ్ చేసి నాలుగు వికెట్లకు 228 పరుగులు చేసింది. విశాఖ కుర్రాడు భరత్(కెప్టెన్) మూడు పరుగులకే బౌల్డ్ కాగా.. రషీద్ సెంచరీ నమోదు చేశాడు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ ఎనిమిది వికెట్లు కోల్పోయి 83 పరుగులే చేసింది. విశాఖకు చెందిన శశికాంత్ రెండు వికెట్లు, జి.మనీష్ పొదుపుగా బౌలింగ్ చేసి ఓ వికెట్ సాధించాడు. సీ గ్రూప్‌లో ఆడుతున్న ఆంధ్రా జట్టు నాలుగు పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మనీష్ ‘సాక్షి’తో మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసి.. నాలుగు పరుగులిచ్చి ఓ వికెట్ తీయడంతో బెస్ట్ బౌలింగ్ రికార్డుగా నమోదైందన్నారు. ఎస్‌ఎంఎ ట్రోఫీలో ఇప్పటివరకు ఈ రికార్డు ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 26న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఇంటర్నేషనల్ చెఫ్ డే



ఎఫ్‌సీఐలో తయారు చేసిన కేకులతో విద్యార్థులు, అధ్యాపకులు

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో ఇంటర్నేషనల్ ఛెఫ్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, కేకులు, బిస్కెట్లు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వి.రమణ, అధ్యాపకులు రవి, కుముదిని, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు జె.ఆర్.నాయుడు

మద్దిలపాలెం : జీవీఎంసీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు జె.ఆర్.నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు 22వ వార్డులో శుక్రవారం పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెల్త్ అలవెన్స్‌లు, బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. భద్రత పరికరాలు, యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. విధుల్లో భాగంగా అనారోగ్యానికి గురైతే వారి స్థానంలో తమ కుటుంబీకులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి



చిన్నారిని పాఠశాలలో చేర్పిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూ క్యాంపస్: పాఠశాలకు వెళ్లకుండా చదువును మధ్యలో ఆపేసిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేలో భాగంగా ఆమె శుక్రవారం ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలను సందర్శించారు. ఆరో తరగతిలో డ్రాపవుట్‌గా ఉన్న విద్యార్థిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపుతూ ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సలోమి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తన

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన భక్తులను అలరించింది. సుభద్రదేవి బృందం ఈ సంకీర్తనలు ఆలపించగా.. భక్తులు పెద్ద ఎత్తున వీక్షించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

ఏయూ సమాచారమ్

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ ఎం.అబ్రహం సంపాదకత్వం వహించిన ‘యూత్ పార్టిసిపేషన్ ఇన్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఎడాప్షన్’ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విపత్తు నిర్వహణపై విభిన్న నిపుణులు రచించిన 25 పరిశోధన పత్రాలను ఈ పుస్తకంలో ప్రచురించారు. విపత్తులు, పర్యావరణ మార్పులు, యువత భాగస్వామ్యం తదితర అంశాలను వీటిలో చర్చించారు. వర్తమాన సమాజంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశంపై పుస్తకాన్ని తీసుకురావడంపై సంపాదకులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుంటూరు శేషేంద్రశర్మ జయంతి



శేషేంద్రశర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం, సంగీత నృత్య విభాగం, సమైక్య భారతి–విశాఖ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు శేషేంద్రశర్మ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా శేషేంద్రశర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ మార్గం పట్టించిన ఇంద్రజాలకుడు శేషేంద్రశర్మ అని చెప్పారు. తెలుగు సాహిత్యం నుంచి నోబుల్ బహుమతికి నామినేట్ అయిన నా దేశం–నా ప్రజలు కావ్య వైశిష్ట్యాన్ని నేటి యువతతో పాటు ప్రతి సాహితీకారుడు తెలుసుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గీతం విశ్వవిద్యాలయ ఆంగ్ల విశ్రాంతాచార్యుడు ప్రయాగ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శేషేంద్ర కవిత్వంలో అద్భుతమైన ప్రతీకలు తొణికిసలాడుతాయన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాహితీ సంద్రాన్ని పరిపుష్టం చేసిన మహనీయుడు శేషేంద్రశర్మ అని కొనియాడారు. అనంతరం అతిథులను ఆచార్యులు, విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఈశ్వరమ్మ, ఆచార్య బూసి వెంకటస్వామి, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయాధికారంలో అందరి భాగస్వామ్యం అవసరం



ఆచార్య రాజేంద్రప్రసాద్‌ని సత్కరిస్తున్న ఐఐపీఏ సభ్యులు

ఏయూ క్యాంపస్: విధానాల రూపకల్పన, నిర్ణయాలు తీసుకోవడంలో అందరి భాగస్వామ్యం తీసుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖ ప్రాంతీయ శాఖ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థలు మరింత జవాబుదారీగా మారాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రాంతీయ శాఖ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శన రావు మాట్లాడుతూ భారతదేశంలోని పరిపాలన వ్యవస్థ నూతన విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న స్థాయిల్లో పరిపాలన సరళతరం చేస్తూ ప్రజలకు మరింత విస్తృత సేవలు అందించడం అవసరమన్నారు. స్థానిక స్వపరిపాలన ఎంతో ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ పూర్వ అధ్యక్షుడు ఆచార్య ఇ.ఎ.నారాయణ, కార్యదర్శి పి.ప్రేమానందం, విభాగాధిపతి డాక్టర్ జి.వీరరాజు, డాక్టర్ హరి, డాక్టర్ సవిత ఆర్.పగ్నిజ్, డాక్టర్ రాజశేఖర్, జగన్‌మోహనరెడ్డి పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు



ఇసుకతోటలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు



22వ వార్డు మంగాపురం కాలనీలో భక్తులకు వడ్డిస్తున్న పీతల గోవింద్



డెయిరీ ఫారం వద్ద భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం వద్ద నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైదా నారాయణరావు, తులసి పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో శ్రీకనకదుర్గ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ 20 రైస్ బ్యాగులు అందజేశారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో దేవీ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో ఎమ్మెల్సీ వంశీకృ శ్రీనివాస్, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు.

ప్రతిష్టాత్మకంగా నూతన విద్యా విధానం అమలు



మాట్లాడుతున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కట్టమని

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన విద్యా విధానం–ఉన్నత విద్యా పోకడలపై సదస్సు నిర్వహించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.వి.కట్టిమని ముఖ్యోపన్యాసం చేశారు. నూతన విద్యా విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీఎస్‌ఎస్‌ఆర్ గౌరవ సంచాలకుడు ఆచార్య బి.సుధాకర్ రెడ్డి సమీకృత విద్యా విధానం ఆవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మార్చాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం సమన్వయకర్తగా ఎ.ఎల్.రూపారాణి వ్యవహరించారు.

20వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేర్ 155 సచివాలయం పరిధిలో చినవాల్తేరు చిన్న హాస్పిటల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ముప్పల లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సుమారు 200 మందికి పైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, సీవో రత్నకుమారి, కన్వీనర్ గుంటుబోయిన నరేష్, చంద్రన తిలక్, రాయల పాపారావు, బందపు వెంకట్, వైద్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శి, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఆచార్య సూర్యప్రకాశరావుకు ఘన సత్కారం



వీసీ ఆచార్య సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న రమణమూర్తి తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ న్యాయ కోవిదుడు, ఏయూ న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య దాసరి సూర్యప్రకాశరావును ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీలో సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ న్యాయ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కలిగిన ఆచార్య సూర్యప్రకాశరావును డీఎస్‌ఎన్‌ఎల్‌యూ ఉపకులపతిగా నియమించడం ప్రతిభకు పట్టం కట్టినట్లయ్యిందన్నారు. ప్రతిభ ఆధారంగా ఉపకులపతిగా ఆచార్య సూర్యప్రకాశరావును నియమించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత సేన అధ్యక్షుడు ఐడీబాబు, స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, కో ఆర్డినేటర్ ఎస్‌వీ రాజారెడ్డి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, కె.సూర్యనారాయణ తదితరులు సత్కరించినవారిలో ఉన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు

పెదగంట్యాడ: తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన 34వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పెదగంట్యాడ సంజీవ కాలనీకి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఎస్పీ చాంపియన్స్ అకాడమీకి చెందిన ప్రవల్లికా రెడ్డి (13) 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, బందారు హాసిత (16) జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించారు. కె.నందిని (14) జావెలిన్ త్రోలో 6వ స్థానంలో నిలిచింది.

శిల్పారామంలో అలరించిన ‘అష్టలక్ష్మీ వైభవం’



శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తునికి చెందిన దర్పణ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం మహా గణపతిం భజే నృత్యాంశంతో ప్రారంభం అయింది. అష్టలక్ష్మీ వైభవం నృత్యరూపకం, లింగాష్టకం, నవదుర్గల ప్రదర్శనలు అలరించాయి. కళాకారులు శ్రీ నితీష్, గాయత్రి, కుందనత్య, మహాలక్ష్మి, స్వరూప, సాహు, అనన్య, లనీష, అనూహ్య, రోషిణి, లోకేశ్వరి, దేవీ ప్రియ తదితర 20 మంది కళాకారులు పాల్గొని తమ నృత్య కౌశలం ప్రదర్శించారు. బి. లక్ష్మీ దేవి నృత్య దర్శకత్వం వహించగా స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి

ఉక్కునగరం: పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు వెయ్యి రోజులకు చేరుకుంటున్న సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులను చైతన్య పరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోరాటంలో పాల్గోవడం వల్ల మాత్రమే ప్రభుత్వం వెనక్కు వెళుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, మసేనురావు, బిషాయ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 57 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఏపీ) ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. వెల్‌కేర్ ఫార్మా, సిద్ధి వినాయక ఇంజినీరింగ్ వర్క్స్, దసపల్లా హోటల్, బీసీఎస్ డిజిటల్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, పోలినేని అసోసియేట్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 411 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 122 మంది అభ్యర్థులు హాజరైతే 57 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.